28112024-DIS-08_Layout 1 11/28/2024 2:03 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# సర్కారుపై తిరుగుబాట్లు

**రాష్ట్ర** ప్రభుత్వంపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. అధికారుల మీద జనం తిరగబడుతున్నారు. మొన్న లగచర్ల, నేడు దిలావర్‌పూర్. స్థలకాలాలు వేరైనా సమస్య ఒక్కటే. సర్కారులో కొరవడిన మానవీయ స్పర్శ ప్రజల కోపానికి కారణమని చెప్పక తప్పదు. తమ కష్టం చెప్పుకొంటే సర్కారు వింటుందన్న నమ్మకం లేకపోవడంతో జనం ఎటూ పాలుపోక తమ దగ్గరకు వచ్చిన అధికారులపై దాడులకు తెగబడుతున్నారు. అసలు నేరం సర్కారుదైతే అధికారులు బలిపశువులుగా మారుతున్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీల కోసం భూముల సేకరణను వ్యతిరేకించిన రైతులు కలెక్టర్‌తో సహా అధికారగణాన్ని తరిమికొట్టారు. లగచర్ల ఓ వైపు రగులుతూ ఉండగానే.. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్న నిర్మల్ జిల్లా రైతులు రోడ్డెక్కడమే కాకుండా, పర్యవసానాల గురించి ఆలోచించకుండా అధికారుల బృందంపై తిరగబడటం గమనార్హం. ఆర్డీవోను బాధితులు ఘెరావ్ చేయడం, నిర్బంధించడం, ఓ ప్రభుత్వ వాహనంపై దాడి కూడా చేయడం లగచర్లను అనివార్యంగా గుర్తుచేసింది. నాలుగు గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు వంటావార్పు చేస్తూ రోడ్డు మీదే బైఠాయించారు. వణికించే చలిలో అర్ధరాత్రి దాకా ఆందోళన కొనసాగించారంటే వారి తెగింపు ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

శాంతియుతంగా సాగాల్సిన నిరసనల్లో హింస తొంగిచూడటం సమర్థనీయం కాదు. అదేవిధంగా ఈ తరహా ఘటనలను ప్రభుత్వం కేవలం శాంతిభద్రతల సమస్యగానే చూడటమూ సరైనది కాదు. కానీ, సంయమనం లేని సర్కారు పోలీసు లాఠీనే ప్రయోగిస్తున్నది. గతంలో అల్లర్లు, లేదా దొమ్మీ జరిగినప్పుడు చిన్నచిన్న కేసులతో సరిపెట్టేది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు హత్యాయత్నం నేరం మోపేదాకా పోయింది. అర్ధరాత్రి, అపరాత్రి ఇండ్లల్లో దూరి మనుషులను పట్టుకుపోతున్నారు. పోలీసు స్టేషన్లలో చిత్రహింసలు పెడుతున్నారు. ఇలా అడ్డూఅదుపూ లేకుండా పోలీసు రాజ్యం చెలాయిస్తుంటే వామపక్షాల మాటేమో గానీ కనీసం పౌరహక్కుల సంఘాలూ ముందుకువచ్చి ఇది అన్యాయమని, అమాయకులను కడగండ్లపాలు చేయొద్దని ప్రభుత్వానికి హితవు పలకడం లేదు. ఈ పరిణామాలు గమనిస్తే ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చామని విస్మయం కలుగకమానదు.

మాయదారి స్కీములు పెట్టి మోసకారి ఆఫర్లు ఇచ్చినట్టుగా గ్యారెంటీల పేరుతో ఊదరగొట్టి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ గుడ్డెద్దు జొన్నచేనులో పడ్డట్టుగా పాలన సాగిస్తున్నది. గమ్యం ఏమిటి? గమనం ఎలా ఉండాలి? అన్న ధ్యాస సర్కారుకు ఉన్నట్టు తోచడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది కావస్తున్నది. ఈ ఏడాది కాలంలో ఒక్క మంచి పని ఏదైనా చేశారా? అని గాలిస్తే మచ్చుకు కూడా కనిపించదు. హామీలు తుంగలో తొక్కి గ్యారెంటీలు గంగలో కలిపేశారు. ప్రజాసంక్షేమాన్ని పండబెట్టి, అభివృద్ధిని ఎండబెట్టారు. కాంగ్రెస్ మార్కు వసూళ్ల కోసం మూసీ నదిలో దేవులాడుతున్నారు. పేదరైతుల పచ్చని పొలాల్లో చిచ్చుపెడుతున్నారు. అనుభవం లేని, పాలన చేతగాని సీఎం రేవంత్ కుటుంబ పాలనకు తెరదీశారు. అన్న, తమ్ముడు, అల్లునికి రాష్ట్రాన్ని రాసిచ్చి ప్రజల పట్ల మాత్రం అయితే పరాకు కాకపోతే చిరాకు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. విసిగిపోయిన ప్రజలు తిరగబడుతున్నారంటే అందుకు బాధ్యత సర్కారుదే. విపక్షం రెచ్చగొట్టిందనే సాకులు ఎక్కువ కాలం నిలవవు. బీఆర్‌ఎస్ తన బాధ్యత మేరకు బాధితులకు సానుభూతి తెలిపి ఉండవచ్చు. సంఘీభావమూ ప్రకటించవచ్చు. కానీ, ప్రజాగ్రహం మాత్రం ఒకరు రెచ్చగొడితే వచ్చేది కాదు. పోలీసు లాఠీలు ఊపితే ఆగేది కాదు. అందలమెక్కించిన ప్రజలే అదను చిక్కితే కిందకు పడదోస్తారని కాంగ్రెస్ పాలకులు తెలుసుకోవాలి. నిప్పుతో చెలగాటమాడితే అసలుకే ముప్పు తప్పదని ప్రభుత్వం గుర్తిస్తే మంచిది.

# ఎవరిది కుటుంబ పాలన?

ఏడాది బర్బాది

**గత ఏడాది నవంబర్ నాటి ముచ్చట. ఆనాటి అసెంబ్లీ ఎన్నికల కోసం తుక్కుగూడలో అనుకుంటా... కాంగ్రెస్ పార్టీ ఓ భారీ సభ ఏర్పాటుచేసింది. సదరు సభకు సోనియా, ప్రియాంక, రాహుల్ వగైరా వగైరా కాంగ్రెస్ పెద్ద నాయకులంతా విమానాలేసుకొని మరీ హైదరాబాద్‌కు వచ్చారు. సభలో పాల్గొన్నవాళ్లంతా పాడిన పాట ఒక్కటే. కేసీఆర్‌ది కుటుంబ పాలన. రాష్ర్టాన్ని ఆ కుటుంబమే శాసిస్తున్నది. స్వయంగా కుటుంబ వారసత్వం కారణంగానే పార్టీ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆయన సోదరి ప్రియాంక తమ వారసత్వ పదవుల గురించి మరిచిపోయి మరీ కేసీఆర్ మీద, ఆయన కుటుంబం మీద నోరుపారేసుకున్నారు.**

**ఇక స్థానిక నాయకులు మరీ రెచ్చిపోయి 'రాష్ట్రంలో యువకులకు ఉద్యోగాలు రాలేదు గానీ.. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం పదవులొచ్చాయి' అంటూ చాలాకాలంగా వాగే సొల్లునే పొల్లు పోకుండా మైకులకు అప్పగించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదు, బీజేపీ, ఇతర చిల్లర మల్లర పార్టీలూ చాలాకాలంగా ఆ పాటనే ప్రజల మెదళ్లకు ఎక్కిస్తూ వచ్చారు. వీరికి పచ్చగ్యాంగులు పెంచి పోషించే మేధోమూకలు, వాళ్లు చెప్పినట్టు ఆటలాడే ప్రజా సంఘాలు; కొన్ని వేల సభలు, సమావేశాల్లో ఈ మాటనే ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయాయి. తెలంగాణను ఓర్వలేని పచ్చగ్యాంగ్.. తమ పత్రికల్లో, టీవీల్లో ఇలాంటి సొల్లుగాళ్లను చాలామందిని కూర్చోబెట్టి పదే పదే ఆ మాటలే పలికించి.. పలికించి పులకించిపోయింది. మొత్తానికి ఈ మూకలన్నీ కలిసి ఆ భావనను ప్రజల మెదళ్లలోకి విజయవంతంగా జొప్పించగలిగాయి.**



**ఎస్జీవీ శ్రీనివాసరావు**

సీన్ కట్ చేస్తే.. ఏడాది తర్వాత అదే నవంబర్ నెల.. ఓ కుటుంబ పెత్తనానికి, అహంకారానికి, అరాచకానికి ఒక మాజీ సర్పంచ్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ మేరకు ఓ సూసైడ్ నోట్ బయటపడింది. అది సీఎం కుటుంబాన్నే వేలెత్తి చూపుతున్నది. తమాషా ఏమిటంటే ఇప్పుడు పచ్చ మీడియాకు కుటుంబ పాలన, కుటుంబ పెత్తనం కనిపించడం లేదు. మరీ విడ్డూరంగా ఓ పచ్చాతిపచ్చ పత్రికకు ఆ వార్త ముఖ్యమైనదని కూడా తోచలేదు. పత్రికలో అసలు వాడనే లేదు. ఇక ఆనాడు కేసీఆర్‌ను కుటుంబపాలన అంటూ దుమ్మెత్తిపోసిన మరో జాతీయ పార్టీకి కూడా ఈ ఘటనలో కుటుంబ పాలన, పెత్తనం కనిపించడం లేదు.

టీవీ స్టూడియోల్లో తిష్టవేసి ''చూపితివట నీ నోటను, బాపురే పదునాల్గు భువన భాండములు'' అన్నట్లు.. నోరు విప్పితే రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, ప్రజాహక్కులు, మానవీయ హక్కులు అంటూ ఫుల్‌స్టాపులు కామాలతో సహా పలికే సొల్లు మేధావులెవరూ నోరు విప్పడం లేదు. అవును మరి.. ఇంటినుంచి బయటకు రాకుండా గోడ కట్టేంత ప్రజాస్వామ్యం వారిని పులకింపజేసి ఉండవచ్చు. అందునా 'ఇప్పుడే అసలైన తెలంగాణ వచ్చినట్టుంది' అనుకునేంత మైకం తాలూకు హ్యాంగోవర్‌ను అంత త్వరగా వదులుకోవడానికి వాళ్లు సిద్ధంగా ఉండకపోనూవచ్చు. అందుకే వర్సిటీలు దాటడం లేదు. టీవీ స్టూడియోల గేట్లు తాకడం లేదు.

నిజానికి కేసీఆర్ కుటుంబ సభ్యులెవరూ నియామకాల ద్వారా రాజకీయ జీవితంలోకి వచ్చినవారు కాదు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని ఆ ఉద్యమ వేదికల ద్వారా ప్రజాజీవితంలోకి వచ్చినవారు. ఎవరికి వారు ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో నిలబడి, గెలిచి చట్టసభల్లోకి వచ్చినవారు. అప్పగించిన బాధ్యతలను ప్రశంసనీయంగా నిర్వర్తించిన వారు. పట్టణాభివృద్ధి మంత్రిగా హైదరాబాద్‌ను ఒకరు తీర్చిదిద్దితే.. నీటిపారుదల మంత్రిగా మరొకరు ప్రతిభ చూపించారు. మంచి పార్లమెంటేరియన్‌గా ఇంకొకరు నిరూపించుకున్నారు. అయినా సరే.. విపక్షాలు, విపరీత పక్షాలు 'ఆ నలుగురు' అంటూ రాగాలందుకున్నాయి. కేసీఆర్ ఇంట్లోనే ఉద్యోగాలు అన్నారు. చిలువలు పలువలుగా ప్రచారాలు చేశారు.

### మరి ఇదేంటి 'బ్రదర్'?

సరే. అది గతం. మరి ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నదేమిటి? ఇక్కడా నలుగురు బ్రదర్స్ ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడం లేదా? ఇది కుటుంబపాలన కాదా? అసలు వీళ్లు ఎవరు? వీరికి ఉన్న అర్హత ఏమిటి? వీరి చరిత్ర ఏమిటి? ఉద్యమాల్లో పాల్గొన్నారా? రాష్ట్ర సాధనకు రాళ్లెత్తారా? ఏ దశలో పాల్గొన్నారు? ఏ ఎన్నికల్లో గెలిచారు? రాష్ర్టానికి వీరి కంట్రిబ్యూషన్ ఏమిటి? ఇప్పుడు ఏ హోదాతో అధికారులను శాసిస్తున్నారు? ఆదేశాలు జారీ చేస్తున్నారు? ప్రభుత్వం చేయాల్సిన భూసేకరణకు వీళ్లెందుకు నడుం కడుతున్నారు? ఏ అధికారంతో చేస్తున్నారు? ప్రభుత్వం ఏం చేయబోతున్నదో, ఎలా చేయబోతున్నదో చెప్పడానికి వీళ్లెవరు? వీళ్లకున్న అధికారమేమిటి? ఒక గ్రామ మాజీ సర్పంచ్‌ను వేధించే ఫ్యాక్షన్ ధోరణులేమిటి? ఇదేమన్నా రాయలసీమనా? సీమ హింసాత్మక రాజకీయాలను ఇక్కడకు దిగుమతి చేస్తారా? రాష్ర్టాన్ని ఎక్కడికి తీసుకుపోతున్నారు? ఈ అరాచక సంస్కృతి ఏమిటి?

### నోరు విప్పితే ఒట్టు!

ఈ అంశం మీద పచ్చ మీడియా ఏనాడన్నా ఒక్క వార్త రాసిందా? మేక తోలు కప్పుకున్న మేధోమూకలు ఇదేమిటని ప్రశ్నించాయా? పోనీ, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుటుంబ పాలన సాగుతుందని ఒక్క మాటైనా మాట్లాడిన పాపాన పోయాయా? ఒక కలెక్టర్ తన చాంబర్ వదిలి బయటకు వచ్చి ఏ హోదా లేని వ్యక్తిని సాదరంగా ఆహ్వానించిన ఘటనే చెప్తున్నది రాష్ట్రంలో ఏ పాలన నడుస్తున్నదో. ఆయన ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా పాల్గొంటాడు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తాడు. ఇది ఆరు నెలలుగా నడుస్తున్నది. అధికారులు నోరెత్తరు. ఏ పదవీ లేని ఆ సోదరుడికి బర్త్‌డే వస్తే పోస్టర్లు వెలుస్తాయి. ఒక సోదరుడు సెక్రెటేరియట్‌లోనే దందాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. అధికారులకు ఆదేశాలిస్తున్నాడనే విమర్శలూ వచ్చాయి. ఒక్క రెవెన్యూ శాఖయే కాదు, ఈ జాడ్యం పోలీసు శాఖకూ పాకింది. హైదరాబాద్ చుట్టుపక్కల జరిగే ఖరీదైన భూమి సెటిల్‌మెంట్లలో వారు వేలు పెడుతున్నారనే ఆరోపణ ఉంది. స్టేషన్‌కు వచ్చే బాధితులకు వారిని కలిసి సెటిల్‌మెంట్ చేసుకోవాలని పోలీసులే చెప్తున్నారని పుకార్లు గుప్పుమన్నాయి. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో బాధితులు కొందరు ఆ మధ్య పత్రికా సమావేశం పెట్టి మీడియాకు వివరించారు కూడా. అయినా మీడియా పట్టించుకోలేదు. మేధోమూకలు నోరు విప్పవు. ఇప్పుడు కుటుంబపాలన ఇంట్లో అన్నదమ్ములకే కాదు, బావలు, బావమరుదులు, అల్లుళ్ల దాకా పాకడం కొత్త పోకడ. అమృత్ స్కీం టెండర్ల వ్యవహారంలో చాలాచాలా ఆరోపణలు వచ్చాయి, వస్తున్నాయి. పార్టీల హద్దులు దాటి మరీ కుటుంబాలు ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ పొందుతున్నాయంటున్నారు.



ఈ వరుసలో తాజా అధ్యాయం ఫార్మా కంపెనీ కోసం భూముల సేకరణ. ఇందులో అల్లుడి పేరు వినబడింది. ఆయన కంపెనీ కోసమే ఈ సేకరణ జరుగుతున్నదనేది విపక్షాల మాట. ఈ విషయంలో అనేక అనుమానాలకు ప్రభుత్వమే తావిచ్చింది. బీఆర్‌ఎస్ హయాంలో ఫార్మాసిటీ ఏర్పాటైంది. అక్కడ ఫార్మా కంపెనీ ఏర్పాటుకు అవకాశం ఉండగా తాజాగా మళ్లీ ఈ భూసేకరణ ఎందుకనే ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన సమాధానం ఇంతవరకు రాలేదు. ఈ సేకరణ వ్యవహారంలో సీఎం కుటుంబ సభ్యుల అతి జోక్యం రైతులను బెదిరింపులకు గురిచేస్తున్నారనే దాక వెళ్లింది. 'వెనక్కి తగ్గేదే లేదు. భూములు తీసుకుని తీరుతాం' అని సీఎం సోదరుడు అనడం ఈ వ్యవహారంలో సీఎం కుటుంబం జోక్యానికి అద్దం పడుతున్నది.

**బీఆర్‌ఎస్ హయాంలో ఏర్పాటైన ఫార్మాసిటీలో కంపెనీలు నెలకొల్పేందుకు అవకాశం ఉండగా మళ్లీ భూసేకరణ ఎందుకనే ప్రశ్నకు ప్రభుత్వం నుంచి ఇంతవరకు సమాధానం రాలేదు. ఈ వ్యవహారంలో సీఎం కుటుంబసభ్యుల అతి జోక్యం రైతులను బెదిరింపులకు గురిచేస్తున్నారనే దాక వెళ్లింది. 'వెనక్కి తగ్గేదే లేదు. భూములు తీసుకుని తీరుతాం' అని సీఎం సోదరుడు అనడం ఈ వ్యవహారంలో సీఎం కుటుంబం జోక్యానికి నిదర్శనం.**

**ప్రభుత్వం, అధికారులు జరపాల్సిన భూసేకరణలో సీఎం సోదరులు వేళ్లు పెట్టడాన్ని మీడియా, మేధో మూకలు ఎత్తి చూపకపోవడం చాలా విచిత్రం, విడ్డూరం. బీఆర్‌ఎస్ హయాంలో అర్ధరాత్రి మోటర్ సైకిళ్లెక్కి మారువేషాల్లో మల్లన్నసాగర్ వెళ్లిన వామపక్ష నాయకులు ఈ భూసేకరణ ఘర్షణలు, దాడులు అధికారుల తరిమివేత దాక వెళ్లాకగాని సందర్శించకపోవడం, తాజా వివాదం లగచర్లలో జరుగుతుంటే సీపీఎం నేత మల్లన్నసాగర్ పునరావాస గ్రామాల్లో పర్యటించి పునరావాసం బాగా లేదని స్టేట్‌మెంట్ జారీ చేయడం ఎందుకో.. ఎవరి ప్రయోజనాలు కాపాడేందుకో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు.**

ఇటునుంచి నరుక్కు రావాల్సిన వ్యవహారాన్ని అటునుంచి నరుక్కురావాలని చూడటం ఏదో మ్యాచ్‌ఫిక్సింగ్ వ్యవహారమేమో అనిపిస్తే తప్పు అనుకున్నవారిది మాత్రం కాదు. లేటెస్ట్ వార్త ఏమిటంటే.. కొడంగల్ భూసేకరణ ఫార్మా కంపెనీ కోసం కాదు, ఇండస్ట్రియల్ కారిడార్ కోసమని వామపక్షాలకు సీఎం చెప్పారట. పరిహారం పెంపు పరిశీలిస్తామన్నారట. ఈ హామీకి వామపక్షాలు సంతృప్తి చెందాయట. అనుకున్నదే! ఇస్తినమ్మ వాయినం. పుచ్చుకుంటినమ్మ వాయినం. ఉభయతారకం.. కానీయండి!!

### కనిపించుట లేదు..!

ఆనాడు కేసీఆర్ లేస్తే ఓ విమర్శ, కూచుంటే ఓ విమర్శ అన్నట్టు ఆయన పాలనా కాలమంతా వెంటబడ్డ అనేక వేదికలు, ఫోరాలు, సంఘాలు ఎక్కడకు పోయాయి? రాష్ట్రంలో 800కు పైగా రైతు ఆత్మహత్యలు జరిగాయి. రైతు స్వరాజ్య వేదిక ఎక్కడపోయింది? సీఎం కుటుంబ సభ్యుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నాడు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎక్కడికిపోయింది? లగచర్లలో రైతుల ఇండ్లపై అర్ధరాత్రి దాడులు జరుగుతున్నాయి. పౌరహక్కుల సంఘాలు ఎటుపోయాయి? రైతుల భూములు లాగేసుకుంటున్నారు. ఎర్రపార్టీలు ఎక్కడకుపోయాయి? హైదరాబాద్ చుట్టుపక్కల భూములు కబ్జాల పాలవుతున్నాయి. బెటర్ హైదరాబాద్ ఎక్కడపోయింది? కొడంగల్ భూముల్లో ఫార్మా కంపెనీలు కాలుష్యం వెదజల్లడానికి రంగం సిద్ధమవుతున్నది. కాలుష్య పోరాట సమితి ఎక్కడపోయింది? అప్పుడు అపరశివతాండవాలు చేసిన ఈ మూకలు ఇప్పుడు ఎందుకు తోకలు ముడిచి కూర్చున్నాయి? ఏ ప్రయోజనం కోసం? ఎవరి ప్రాపకం కోసం? తమ పోషకుల ఆదేశాలు అందుకుంటే తప్ప కదలవా? ప్రగతి భవన్ కట్టిన నాటి నుంచి దాని మీద పడి ఏడ్చే మీడియాగాళ్లు, వాళ్లు ప్రమోట్ చేసిన మేధావుల వేషంలో ఉన్న సోదిగాళ్లు అదే ప్రగతిభవన్ ప్రజాభవన్‌గా పేరు మారిన తర్వాత దాన్ని కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు వాడుకోవడం మీద నోరెత్తడం లేదు. ఎత్తితే వారిని ఎత్తి ఎత్తి మేధావులనే వీరతాడు వేసిన పచ్చమీడియా తొక్కేస్తుందనే భయం బహుశా వెంటాడుతుంటుందేమో మనకు తెలియదు.

### తాజా ఖబర్

నిన్నటి నుంచి సోషల్ మీడియాను ఓ సినిమా తాలూకు క్లిప్పింగ్‌లు ముంచెత్తుతున్నాయి. ఆ సినిమా పేరు కేసీఆర్. సినిమా థియేటర్‌లో రోమాలు నిక్కబొడుచుకునే ఓ పాట బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తుండగా.. తెర మీద కేసీఆర్ బొమ్మ కనిపించగానే ప్రేక్షకులు ఒక్కసారిగా లేచి.. తెలంగాణ, కేసీఆర్ అంటూ ఈలలతో కేరింతలు కొడుతున్నారు. అంతా యువకులే. కేసీఆర్ అనే పదమే వారిలో వైబ్రేషన్ సృష్టిస్తున్నది. ఉద్యమకాలం నాటి సభల్లో కనిపించిన ఉత్సాహం మళ్లీ చూస్తున్నట్టనిపించింది. దుష్ప్రచారాలకు వేగం ఎక్కువ, ఆయువు తక్కువ. గ్రహణాలైనా.. గంటలు-ఘడియల్లోనే ముగుస్తాయి!

# దాస్య శృంఖలాలు తెంచిన దీక్ష

**అది కరీంనగర్, తీగలగుట్టపల్లెలోని కేసీఆర్ భవన్.. 2009 నవంబర్ 29వ తేదీ. ఒకవైపు దేశవ్యాప్తంగా ఉత్కంఠ.. మరోవైపు ఏం జరుగుతుందోనన్న ఆతృత.. కేసీఆర్ భవన్ చుట్టూ జరిగే ప్రతి కదలికను 24 గంటలు డేగకళ్లతో చూస్తున్న నాటి ప్రభుత్వం.. గుక్క తిప్పుకోకుండా పోటాపోటీగా లైవ్ ప్రసారాల కొనసాగింపు.. ఇసుకేస్తే రాలనంత పోలీసు బలగాల మోహరింపు.. నలుదిశలా కదిలివచ్చిన ప్రజలు.. వీటి మధ్య ఇంట్లో నుంచి కేసీఆర్ బయటకు వచ్చారు. ఒక్కసారిగా జై కేసీఆర్ అంటూ పిడికిలెత్తిన జనాలు.. నినదించిన కళాబృందాలు.. చుట్టూ రక్షణ కవచంలా నిలిచిన ప్రజలు.. వీర తిలకం దిద్దిన మహిళలు.. ప్రజల అభిమానానికి శిరసు వంచి రెండు చేతులతో నమస్కరించిన ఉద్యమ వీరుడు.. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అంటూ ఉద్వేగభరితంగా ఇచ్చిన నినాదం మధ్య విజయ సంకేతాన్ని చూపిస్తూ.. గమ్యాన్ని ముద్దాడేందుకు కేసీఆర్ బయలుదేరారు.**



**కడపత్రి ప్రకాశ్‌రావు**
80966 77022

చుట్టూ పోలీసు జీపులు.. ముందూవెనకా కిలోమీటర్ల పొడవునా ప్రజల పరుగులు.. కేసీఆర్ భవన్ నుంచి మానేరు బ్రిడ్జి వరకు కేసీఆర్‌ను దీక్షకే సాగనంపుతున్నట్లుగా నటించిన పోలీసులు అక్కడికి రాగానే సీన్ మార్చి.. కేసీఆర్ వాహనాన్ని మాత్రమే ముందుకు పోనిచ్చారు. ఆ వెంటే అల్గునూర్ చౌరస్తా వద్ద అరెస్టుల పరంపరలు.. ఎదురు తిరిగిన ప్రజలు... సంఘటన స్థలానికి ప్రధాన నాయకులు చేరుకునేలోపే కేసీఆర్‌ను తీసుకొని పరుగులు పెట్టిన పోలీసు వాహనాల దృశ్యాలు.. నేటికీ కళ్లముందే కదలాడుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆ రోజు కేసీఆర్ చేసిన నిరాహార దీక్షే మలిదశ ఉద్యమం ఉగ్రరూపం దాల్చడానికి ప్రధాన కారణం. ఆ దీక్ష ఫలితమే నేటి తెలంగాణ.

నాడు స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ దేశాన్ని ఒక్కతాటిపైకి తెస్తే.. బానిస సంకెళ్ల మధ్య బందీ అయిన తెలంగాణ దాస్య శృంఖలాలు తెంచడానికి కేసీఆర్ యావత్ తెలంగాణను ఒక్కతాటిపైకి తెచ్చారని చెప్పడం అతిశయోక్తి కాదు. అదే వాస్తవం. అతని పిలుపు మేరకే తెలంగాణ సమాజం సమరాంగణంలో దూకింది. సంఘటిత శక్తిగా నిలిచింది. చరిత్ర ఎరుగని ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించింది. దేశమే దిగివచ్చి తెలంగాణ రాష్ర్టాన్ని ప్రకటించాల్సిన అనివార్యతను, అగత్యాన్ని సృష్టించింది. మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని నడిపించి గమ్యాన్ని ముద్దాడింది.



సుదీర్ఘ పోరాటం ద్వారానే తెలంగాణ సిద్ధించింది తప్ప, పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదు. ఈ రోజు కొంతమంది కుహనా రాజకీయ నాయకులు స్వరాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర లేదన్నట్లుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నాటి వాస్తవాలను ముఖ్యంగా నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి ఏపీలో తెలంగాణకు అడుగడుగునా జరుగుతున్న అన్యాయంపై అనేక ఉద్యమాలు జరిగాయి. కానీ, నాటి పాలకుల కుట్రలు, కుతంత్రాల ముందు ఏ ఉద్యమం గమ్యాన్ని ముద్దాడలేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా కేసీఆర్ మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో 2009, నవంబరు 29న ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. ఈ దీక్షకు బయలుదేరడానికి ఒక రోజు ముందే కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్‌కు ఆయన చేరుకున్నారు. 2009, నవంబరు 29న కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్ నుంచి సిద్దిపేట పరిధిలోని రంగధాంపల్లిలో ఏర్పాటు చేసిన దీక్షాస్థలం వద్దకు కేసీఆర్ బయలుదేరారు. కానీ, కరీంనగర్ మానేరు బ్రిడ్జి వద్ద గల అల్గునూర్ చౌరస్తాలో కేసీఆర్‌ను అరెస్టు చేశారు. ఎదురుతిరిగిన ప్రజలను తప్పించుకొని ఖమ్మం జైలుకు కేసీఆర్‌ను తరలించారు. ఖమ్మం జైల్లోనే కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్షకు కూర్చున్నారు. కేసీఆర్ అరెస్టుతో తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. సబ్బండ వర్గాలు ఒక్కటై కేసీఆర్‌కు అండగా నిలిచాయి. 'నా దీక్ష వల్ల తెలంగాణ వస్తే జైత్రయాత్ర, లేకుంటే నా శవయాత్ర ఉంటుంద'ని కేసీఆర్ చెప్పడంతో కేంద్రం దిగి రాక తప్పలేదు.

స్వరాష్ట్ర సాధన కోసం పట్టు వదలని విక్రమార్కుడిలా కేసీఆర్ ముందుకు సాగారు. ఈ పోరాటంలో అనుకున్న లక్ష్యాన్ని చేరడానికి అవమానాలు భరించారు. అరాచకాలకు, కుట్రలకు, కుతంత్రాలకు ఎదురొడ్డి నిలిచారు. ఒక్కడితో మొదలైన ఉద్యమం ఆ తర్వాత నాలుగు కోట్ల మందిని కదిలించింది. బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) ఏర్పాటు నాటికి సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్.. స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న టీడీపీకి, తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అక్కడి నుంచి ఆరంభమైన రాజీనామాల పర్వం స్వరాష్ట్ర సాధన వరకు కొనసాగింది.

తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ నిర్వహించిన సభలు చరిత్ర సృష్టించాయి. 2001 మే 17న కరీంనగర్‌లో నిర్వహించిన సింహగర్జన సభ చరిత్రను తిరగరాసింది. 2003 జనవరి 6న పరేడ్ మైదానంలో తెలంగాణ గర్జన పేరిట సభ నిర్వహించి అన్ని వర్గాలను కేసీఆర్ ఆకట్టుకున్నారు. ఉద్యమ ప్రస్థానంలో తెలంగాణ వాదాన్ని బతికించుకునేందుకు కేసీఆర్ అనేకసార్లు రాజీనామా అస్ర్తాన్ని సంధించారు. అయినా పాలకుల్లో చలనం రాకపోవడంతో.. తన ప్రాణాన్ని పణంగా పెట్టేందుకు సిద్ధమై ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. కేసీఆర్‌కు మద్దతుగా యావత్ తెలంగాణ రోడ్లపైకి రావడంతో తెలంగాణ కల సాకారమైంది.

ఉద్యమ ప్రస్థానంలో బీఆర్‌ఎస్ చరిత్ర ఉప్పెన తరంగం వంటిది. ఇలా ఎన్నో త్యాగాల పునాదుల మీద ఏర్పడిందే తెలంగాణ. ఉద్యమ ప్రస్థానం తెలియక నేటి యువత సోషల్ మీడియాలో జరిగే విషప్రచారాన్ని నమ్మే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్వరాష్ట్ర సాధనకు కారణమైన కేసీఆర్‌ను.. ప్రజల ఆకాంక్షను సాధించడానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన 2009 నవంబర్ 29వ రోజును ప్రతి తెలంగాణ పౌరుడు ఒక్కసారైనా మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఉద్యమ చరిత్ర భావితరాలకు చేరుతుంది. భవిష్యత్ పోరాటాలకు ఒక వేదికగా నిలుస్తుంది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

**(నవంబర్ 29న కేసీఆర్ దీక్షా దివస్ సందర్భంగా...)**

**ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు చెప్పిన ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్య పరిరక్షణ. కానీ, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ ఆరు గ్యారెంటీలు ఇవ్వకపోగా.. ఏడో గ్యారెంటీకి పూర్తిగా ఎగనామం పెట్టింది. లగచర్ల ఘటనే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ ఏడాది పాలనకు ఆ ఘటన పరాకాష్ఠ. తమ భూములను బలవంతంగా గుంజుకుంటారేమోననే భయాందోళనలో కట్టలు తెంచుకున్న అన్నదాతల ఆగ్రహం దాడుల దాకా వెళ్లింది. అయితే, అది అధికారులపై దాడి కానే కాదు. ముమ్మాటికీ రేవంత్ సర్కార్‌పై తిరుగుబాటే.**

# 'ఏడో' గ్యారెంటీకీ ఎగనామం



**దేవిప్రసాద్**

అన్నదాతల నిరసనను కలెక్టర్, అధికారులపై దాడిగా, రైతులను గుండాలుగా, రౌడీమూకలుగా కాంగ్రెస్ నాయకులు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. స్వయంగా కలెక్టరే తనపై దాడి జరగలేదని తెలిపారు. సీఎం సొంత నియోజకవర్గంలో తిరుగుబాటు జరగడాన్ని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ పాలకులు.. ప్రజాసమస్యలపై రాజీలేని పోరా టం చేస్తూ, ప్రజలను చైతన్యం చేస్తున్న బీఆర్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. బీఆర్‌ఎస్‌పై కోపంతో లగచర్లను దిగ్బంధం చేసి అమాయక గిరిజన రైతులపై దాడులు చేయడం గర్హనీయం.

లగచర్ల ఘటన జరిగిన నాటినుంచి ఆ గ్రామంలోకి ఎవరినీ వెళ్లనీయడం లేదు. ఆ గ్రామం పాకిస్థాన్‌లో ఉన్నట్టుగా పాలకులు వ్యవహరిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు లగచర్లను సందర్శించి, బాధితులను పరామర్శించడానికి వెళ్లగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అంతేకాదు, జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, ఆఖరికి మహిళా సంఘాలను కూడా గ్రామంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న రేవంత్ సర్కార్ తెలంగాణను పోలీస్ రాజ్యంగా మార్చింది.



ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రగా రైతుల నిరసనను పేర్కొంటున్న రేవంత్ సర్కార్.. తమపై తిరుగుబాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను వ్యూహాత్మకంగా వదిలేసింది. వారిని కూడా అరెస్టుచేస్తే బీఆర్‌ఎస్ కుట్ర అనే డ్రామాను రక్తి కట్టించడం సాధ్యం కాదని పాలకులకు బాగా తెలుసు. అందుకే, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులనే అరెస్ట్ చేయించారు. ఈ క్రమంలో రైతుల కు సంకెళ్లు వేసి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, పలువురిని జైలుకు పంపించడం శోచనీయం.

**ఫార్మా కంపెనీల కోసం కేసీఆర్ ప్రభుత్వం ముచ్చర్లలో సుమారు 14,000 ఎకరాలను గతంలో సేకరించింది. ఒకే దగ్గర ఫార్మా కంపెనీలను ఏర్పాటుచేస్తే కాలుష్యాన్ని నియంత్రించవచ్చనేది బీఆర్‌ఎస్ సర్కార్ భావన. గత బీఆర్‌ఎస్ సర్కార్ సేకరించిన భూములపై రేవంత్ సర్కార్ కన్ను పడింది. అందుకే, ఫోర్త్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సిద్ధమైంది.**

తమ భూములను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు లగచర్ల రైతులు విన్నవించుకున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపాలని, తాము అండగా ఉంటామని నరేందర్ రెడ్డి, కేటీఆర్ అన్నదాతలకు భరోసా ఇచ్చారు. అంతేకాదు, ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పాలకులు చేస్తున్న అరాచకాలను అడుగడుగునా అడ్డుకున్నారు. అందుకే, కుట్రదారుడిగా ఆరోపిస్తూ నరేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, అతన్ని అక్రమంగా అరెస్ట్ చేశారు.

**లగచర్ల రైతులది ముమ్మాటికీ ధర్మాగ్రహంతో కూడిన నిరసన. ఒక్క లగచర్ల రైతులే కాదు, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారు. ఒక్క హామీ అమలు చేయకుండా, గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలనూ ఎత్తివేసి కాంగ్రెస్ సర్కార్ ప్రజలను వేధిస్తున్నది. అందుకే, రాష్ట్రవ్యాప్తంగా సబ్బండవర్గాలు కాంగ్రెస్‌పై కన్నెర్రజేస్తున్నాయి.**

దేశంలోని ఇతర రాష్ర్టాల్లో అదానీ, పెట్టుబడులను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్.. తెలంగాణలో మాత్రం ఆయన కంపెనీలకు ఎర్రతివాచీ పరుస్తున్నది. కాలుష్య కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నాయకత్వంలో ప్రజలు ఉద్యమిస్తుంటే.. బీజేపీ, కాంగ్రెస్ ఏకమై ప్రజాభిప్రాయాన్ని పక్కదారిపట్టిస్తున్నాయి. లగచర్ల ఘటనలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరును బీజేపీ సమర్థించడమే ఆ రెండూ పార్టీలు ఒక్కటేనని చెప్పేందుకు తార్కాణం.

మనకు అన్నం పెట్టే రైతన్నలు ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలబడకపోతే మనమే అసలైన దోషులుగా మిగిలిపోతాం. ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతున్న సమయంలో చూస్తూ కూర్చుంటే మనం ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతాం. రాజకీయాలకు అతీతంగా లగచర్ల రైతులకు అండగా నిలబడి ప్రభుత్వ దమననీతిని ఎదిరిద్దాం. ఎన్ని నిర్బంధాలు విధించినా మొక్కవోని ధైర్యం ప్రదర్శిస్తున్న రైతులపక్షాన ప్రజా ఉద్యమానికి సన్నద్ధమవుదాం.

(వ్యాసకర్త: కార్పొరేషన్ మాజీ చైర్మన్)